త్రినేత్ర న్యూస్ తెలుగు
Trinethra News Telugu
సత్యం ధర్మం జ్ఞానం

Hyderabad
26 October, 2026
Evening Edition

www.trinethra.news
TGTEL/26/A6603
సంపుటి (Volume): 01
సంచిక (Issue) : 34
పేజీలు (Pages) : 04
వెల (Price) : ₹ 1.00
360° Digital News




# మహారాష్ట్ర ప్రజలు వ్యతిరేకించకపోతేనే..

## మేం తుమ్మిడిహెట్టి ఎత్తుపై పరిశీలిస్తాం.. అన్ని అంశాలపై మళ్లీ అధ్యయనం జరగాలి

- ఆ తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటాం: మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్
- ముంబైలో సీఎం రేవంత్ రెడ్డి బృందం భేటీ
- 152 మీటర్ల ఎత్తుపై నిర్ణయించాలన్న తెలంగాణ ప్రతిపాదనపై కీలక చర్చలు
- మహారాష్ట్ర సీఎం సానుకూలంగా స్పందించారు : సీఎం రేవంత్ రెడ్డి

మహారాష్ట్ర ప్రజలు వ్యతిరేకించకపోతే తుమ్మిడి హెట్టి బ్యారేజీ ఎత్తుపై తాము పున: సమీక్షించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ రాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ స్పష్టం చేశారు. బ్యారేజీ ఎత్తు కు సంబంధించి సాంకేతిక అధ్యయనాలు జరిగిన తర్వాతే ఓ తుది నిర్ణయానికి రావాల్సి ఉంటుందని చెప్పారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపుదలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, చీఫ్ సెక్రెటరీ సంజయ్ జాజూ, ప్రధాన సలహాదారు రామకృష్ణారావు ల బృందం ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సమావేశమైంది. ఈ భేటీలో రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దుల్లో ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై కీలక చర్చలు జరిగాయి. బ్యారేజీ ఎత్తు పెంపు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, ఇతర సాంకేతిక అంశాలపై చర్చించారు.

**త్రినేత్ర న్యూస్ :**
తుమ్మిడిహెట్టి బ్యారేజీకి సంబంధించి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి .. మహారాష్ట్ర సీఎంకు, అధికారులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఆదిలాబాద్ జిల్లాకు సాగునీరు అందించేందుకు 1975 అక్టోబర్ 6న అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, ఎస్బి చవాన్ మధ్య కుదిరిన ఒప్పందం నుంచి.. ఈ రోజు వరకు వివిధ దశల్లో ప్రయత్నాలు

తరువాయి 2లో

### • మా వాళ్లు వ్యతిరేకించకపోతే.. మేం ఓకే

తుమ్మిడిహెట్టి బ్యారేజీ 148 మీటర్ల ఎత్తు అంశాన్ని పున: పరిశీలించేందుకు మేం సిద్ధమే. కానీ తుది నిర్ణయానికి వచ్చే ముందు అనేక అంశాలపై అధ్యయనం చేయాలి. అన్నింటికన్నా ముఖ్యంగా మహారాష్ట్ర ప్రజలు వ్యతిరేకించకపోతే మాకు ఎలాంటి అభ్యంతరమూ లేదు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో కేంద్ర జల సంఘం తన పరిధిలో అవసర మైన అధ్యయనాలు చేపడుతుంది.సాంకేతిక పరిశీలనలు కొనసాగిస్తుంది. ఈలోపు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలి. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యతపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలి. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలను పరిశీలించాలి. పరిహారం, ఇతర సాంకేతిక అంశాలను కూడా అధ్యయనం చేయాలి.

–మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధానంగా వెనుకబడిన అటవీ ప్రాంతం. కొమురం భీమ్ సాగించిన జల్, జంగిల్, జమీన్ పోరాటం చిరస్మరణీయం.ఆ పోరాట కాలం నుంచి ఆదిలాబాద్ ప్రాంత ప్రజలు సాగు, తాగునీటి సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నారు. దశాబ్దాలుగా వారి ఆకాంక్షలు నెరవేరలేదు. ఆదిలాబాద్ గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉంది.వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రెండు రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలి. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నాం. ఈ సదస్సుకు మీరు (మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్) తప్పకుండా హాజరుకావాలి.

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### • పరిహారం చెల్లిస్తాం

2016లో తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయిస్తూ ఒప్పందం కుదిరింది. ఆ ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే తెలంగాణ ప్రాంత తాగు, సాగునీటి అవస రాలు పూర్తిస్థాయిలో తీరవు. తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించ డమే అత్యంత ప్రయోజనకరమైన ప్రత్యా మ్నాయం. బ్యారేజీ నిర్మాణంతో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు మహా రాష్ట్రలో అమల్లో ఉన్న భూసేకరణ నిబం ధనలు, ఆ రాష్ట్ర పరిహార విధానం ప్రకారం రైతులకు పరిహారం చెల్లిస్తాం.



- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్

## మాటిమాటికి సీఎం ఢిల్లీ ఎందుకు పోతున్నడు

- ఢిల్లీ బాట పట్టడం రాజకీయ బాధ్యతారాహిత్యానికి నిదర్శనం
- సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసురుతున్నా..
- కొండారెడ్డిపల్లిలో ఎన్ని ఓట్లు తొలగించారో నిరూపించండి
- మీడియా సమావేశంలో బీజేపీ చీఫ్ రాంచందర్ రావు



2

## నేను సచ్చిపోతెనే బిల్లులిస్తరా?

జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సొంత ప్ర భుత్వంపైనే మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను చనిపోతేనే రోడ్ల నిర్మాణ బిల్లులు వస్తాయంటే చావడానికి సిద్ధమేనని వ్యాఖ్యానించారు. నా చావుకు రూ.40 కోట్ల విలువనా అని ప్రశ్నించారు. తాను బతకాల్నో వద్దో ప్రభుత్వమే చెప్పాలన్నారు.



2

## నవంబర్ 2న తెలంగాణలో అమిత్ షా పాదయాత్ర



**త్రినేత్ర న్యూస్ :** కాంగ్రెస్ సృష్టిస్తున్న అరాచకాలకు వ్యతిరేకంగా నవంబర్ 2న 'లోక్‌తంత్ర్ బచావో – సేవ్ డెమోక్రసీ' నినాదంతో బీజేపీ ఆధ్వర్యంలో భారీ పాదయాత్ర నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తెలిపారు. ఈ పాదయాత్రలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొంటారని ఆయన వెల్లడించారు. నాంపల్లిలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం రామచందర్ రావు మీడియాతో మాట్లాడారు. 'లోక్‌తంత్ర్ బచావో – సేవ్ డెమోక్రసీ' అనే నినాదంతో మేం నవంబర్ 2వ తేదీన పాదయాత్ర చేస్తున్నాం అని రామచందర్ రావు తెలిపారు.



## డిండికి నీళ్లు పంపిస్తమంటే ఒప్పుకోం

- డీకే అరుణ

**త్రినేత్ర న్యూస్ :** పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగమైన ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి ప్రాజెక్టు కు నీళ్లు ఎత్తిపోయాలన్న సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ తప్పుబట్టారు. ఈ నిర్ణయంపై ఆమె తీవ్రంగా స్పందించారు. డిండి ప్రాజెక్టుకు నీటిని కేటాయించాలన్న ప్రతిపాదనను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. డిండి ఎత్తిపోతల పథకాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్లను రద్దు చేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వ్యక్తి. పాలమూరు ప్రజల ఆశీస్సులతోనే ఆయన సీఎం అయ్యారు. అలాంటి వ్యక్తి.. పాలమూరు రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉండే డిండి ఎత్తిపోతలకు మద్దతు తెలపడం ఏమాత్రం సరికాదు అని డీకే అరుణ అన్నారు. కేవలం తన పదవిని కాపాడుకునేందుకు.. సొంత జిల్లా రైతులకే హాని తలపెడుతున్నారు. అని ఎంపీ అరుణ విమర్శించారు.



## ఓటరు నమోదు బాధ్యత ఎన్నికల కమిషన్ దే

- మాజీ మంత్రి తలసాని

**త్రినేత్ర న్యూస్ :** ఓటరు నమోదు బాధ్యత ముమ్మాటికీ ఎన్నికల కమిషన్‌పైనే ఉన్నది అని మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమంలో జరుగుతున్న తప్పిదాలపై ఎన్నికల కమిషన్ సీఈవో సుదర్శన్ రెడ్డికి తలసాని శ్రీనివాస్ యాదవ్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రతిని ధుల బృందం వినతిపత్రం అందజేసింది. అనంతరం తలసాని శ్రీనివాస్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ బాధ్యతగా వ్యవహరించ డం లేదు. నవంబర్ 6వ తేదీతో గడువు ముగియనున్న ఇప్పటి వరకు కనీసం బీఎల్‌వోలను నియమించలేదు.. ఇప్పటికైనా ఇంటింటికీ వెళ్ళి ప్రతి గ్రాడ్యుయేట్‌ను ఓటరుగా నమోదు చేసేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలి అని తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు.



## రేపట్నుంచి భారీ వర్షాలు..!

**త్రినేత్ర న్యూస్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం అర్నాబ్ తుఫానుగా బలపడింది. సోమవారం అర్ధరాత్రికి అది తీవ్ర తుఫాన్‌గా, మంగళవారం అతి తీవ్ర తుఫానుగా బలపడనుంది. దీంతో మంగళవారం రాష్ట్రంలో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అక్టోబర్ 28న ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. జయశంకర్ భూపాలపల్లి, సూర్యాపేట, వరంగల్, హనుమకొండ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్ నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. లేదంటే ఆకాశమంతా మేఘావృతమై ఉండనుంది. బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

# మాటిమాటికి సీఎం ఢిల్లీ ఎందుకు పోతున్నడు

- ఢిల్లీ బాట పట్టడం రాజకీయ బాధ్యతారాహిత్యానికి నిదర్శనం
- సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసురుతున్నా..
- కొండారెడ్డిపల్లిలో ఎన్ని ఓట్లు తొలగించారో నిరూపించండి
- మీడియా సమావేశంలో బీజేపీ చీఫ్ రాంచందర్ రావు



**త్రినేత్ర న్యూస్ :**

రాష్ట్రంలో కరువు కరాళ నృత్యం చేస్తుంటే.. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం ఆ సమస్యను గాలికి వదిలేసి.. మాటిమాటికి ఢిల్లీకి ఎందుకు పోతున్నాడని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు నిలదీశారు. కరువు నివారణ చర్యలు తీసుకోకుండా.. రేవంత్ ఢిల్లీ బాట పట్టడం ఆయన రాజకీయ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు. సోమవారం నాంపల్లిలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో రామచందర్ రావు మీడియాతో మాట్లాడారు.

తెలంగాణలో వర్షాభావం వల్ల 330 మండలాలు కరువును ఎదుర్కొంటున్నాయని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఆరు వేలకు పైగా చెరువులు ఉంటే.. కేవలం 500 చెరువుల్లోనే నీరు ఉందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుందన్నారు. 'రోమ్ నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి పిడేలు వాయించినట్లుగా, రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి ఉంటే సీఎం ఢిల్లీ ర్యాలీలకు వెళ్తున్నారు' అని రామచందర్ రావు విమర్శించారు.

కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని రామచందర్ రావు ఆరోపించారు. దేశంలో గుర్తించిన 13 కోట్ల ఏఎస్‌డీడీ ఓటర్ల వివరాల్లో మరణించినవారు, వేరే ప్రాంతాలకు మారినవారు మాత్రమే ఉన్నారని స్పష్టం చేశారు. 'రేవంత్ రెడ్డి గారికి సవాల్ విసురుతున్నా.. మీ సొంతూరు కొండారెడ్డిపల్లికి వస్తా.. సమయం చెప్పండి. అక్కడ ఎన్ని ఓట్లు తొలగించారో నిరూపించండి' అని సవాలు విసిరారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటూ తొలగించబడదని రామచందర్ రావు భరోసా ఇచ్చారు.

## నేను సచ్చిపోతెనే బిల్లులిస్తరా?

- అట్లయితే ఆమరణ దీక్షకు దిగుతా
- నేను బతకాల్నో వద్దో ప్రభుత్వమే చెప్పాలి
- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**త్రినేత్ర న్యూస్:**



జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సొంత ప్రభుత్వంపైనే మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను చనిపోతేనే రోడ్ల నిర్మాణ బిల్లులు వస్తాయంటే చావడానికి సిద్ధమేనని వ్యాఖ్యానించారు. నా చావుకు రూ.40 కోట్ల విలువనా అని ప్రశ్నించారు. తాను బతకాల్నో వద్దో ప్రభుత్వమే చెప్పాలన్నారు. తన నియోజకవర్గంలో రోడ్లు పూర్తి చేయకుంటే 30 వేల మందితో ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. సోమవారం మహబూబ్ నగర్ జిల్లా రాజాపూర్ మండల పరిధిలోని రంగారెడ్డి గూడ, గుండ్ల పొట్లపల్లితో పాటు పలు గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రోడ్ల నిర్మాణానికి బిల్లులు మంజూరు చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. కేవలం మంత్రుల నియోజకవర్గాలకే బిల్లులు చెల్లిస్తారాత? మరి మిగతా ఎమ్మెల్యేల పరిస్థితి ఏంటి? ఇటీవల ఓ కాంట్రాక్టర్ చనిపోతే ఆయనకు రూ.5 కోట్ల బిల్లు మంజూరు చేశారు. 'అట్లయితే నా నియోజకవర్గ పనుల బిల్లుల కోసం నేను సచ్చిపోతా. నా నియోజకవర్గంలో నీటి కాల్వలు, నీళ్లు వచ్చేదాకా కొట్లాడుతా. అప్లికేషన్లు కూడా పెట్టిన. జడ్చర్ల ప్రజలు అండగా ఉండాలే.

**సమానంగ అభివృద్ధి చస్తెనే ప్రభుత్వం ఉంటది..**

రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలు సమానంగా అభివృద్ధి చెందితేనే ప్రభుత్వానికి మనుగడ ఉంటుంది. బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి అని అనిరుధ్‌రెడ్డి డిమాండ్ చేశారు.




## మేడిగడ్డ ఎత్తితే ఊర్లు కొట్టుకుపోతయ్

- భువనగిరి ఎంపీ చామల

**త్రినేత్ర న్యూస్:** కుంగిన మేడిగడ్డ నుంచి నీళ్లు ఎత్తితే ఊర్లకు ఊర్లే కొట్టుకుపోతాయని ఎన్‌డీఎస్‌ఏ చెప్పిందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్లనే నీళ్లను వాడుకునే ప్రయత్నం చేయలేకపోతున్నామని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావాన్ని కూడా రాజకీయాలు చేస్తున్నారు. వర్షాలు పడక భూగర్భ జలాలు కూడా తగ్గుతున్నాయి. నేరుగా ఏపీకి నీళ్లు వెళ్తున్నాయనే దుష్ప్రచారం చేస్తున్నారు అని మండిపడ్డారు.



# వ్యతిరేకించకపోతేనే..

**మొదటిపేజీ తరువాయి..**

సాగుతున్నాయన్నారు. 2016లో తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయిస్తూ ఒప్పందం కుదిరిందని గుర్తుచేశారు. అయితే, ఈ ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే తెలంగాణ ప్రాంత తాగు, సాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు.ఈ పరిస్థితుల్లో తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడమే అత్యంత ప్రయోజనకరమైన ప్రత్యామ్నాయమని వివరించారు. మహారాష్ట్రలో అమల్లో ఉన్న భూసేకరణ నిబంధనలు, ఆ రాష్ట్ర పరిహార విధానం ప్రకారం రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు.

**కలిసికట్టుగా ముందుకు సాగుదాం : సీఎం రేవంత్ రెడ్డి**

ఆ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ–మహారాష్ట్ర మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను గుర్తుచేశారు. కొమురం భీమ్ సాగించిన జల్, జంగిల్, జమీన్ పోరాటాన్ని గుర్తుచేశారు. ఆ పోరాట కాలం నుంచి ఆదిలాబాద్ ప్రాంత ప్రజలు సాగు, తాగునీటి సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదన్నారు. రెండు రాష్ట్రాలను భౌతికంగా అనుసంధానించే వారధిగా కూడా నిలుస్తుందన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, గిరిజనుల సంక్షేమానికి రెండు రాష్ట్రాల సహకారం అవసరమన్నారు. పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సహకరించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు.

**ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సుకు ఆహ్వానం**

హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ సదస్సుకు హాజరుకావాలని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను ఆహ్వానించారు. ఈ ఆహ్వానంపై ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. సదస్సులో పాల్గొనేందుకు ఆసక్తి ఉందని తెలిపారు. హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానన్నారు.

- **పరిశీలిస్తాం..కానీ : మహా సీఎం ఫడ్నవీస్**

తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను మరోసారి పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అయితే, తుది నిర్ణయానికి వచ్చే ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మహారాష్ట్రకు, తమ ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఎత్తు ఒప్పందాన్ని పున: పరిశీలించేందుకు అభ్యంతరం లేదన్నారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో కేంద్ర జల సంఘం తన పరిధిలో అవసరమైన అధ్యయనాలు చేపడుతుందని తెలిపారు. సాంకేతిక పరిశీలనలు కొనసాగిస్తుందన్నారు. ఈలోపు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడ్నవీస్ ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యతపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలను పరిశీలించాలన్నారు. పరిహారం, ఇతర సాంకేతిక అంశాలను కూడా అధ్యయనం చేయాలన్నారు.ముంపు ప్రభావం, ప్రభావిత భూముల విస్తీర్ణంపై రెండు రాష్ట్రాల అంచనాలను పరిశీలించాలని సూచించారు. ఇరు రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అవసరమైతే ప్రత్యామ్నాయాలను కూడా అధ్యయనం చేయాలన్నారు.




## కాంగ్రెస్ ఢిల్లీ మహా ర్యాలీకి వేళాయె

- రంగంలోకి టీపీసీసీ కీలక కమిటీ..

 మంత్రులు, ఎంపీలకు బాధ్యతలు

**త్రినేత్ర న్యూస్:** హస్తిన వేదికగా కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన భారీ జాతీయ ఆందోళన కార్యక్రమానికి తెలంగాణ నుంచి భారీ ఎత్తున తరలివెళ్లేందుకు రంగం సిద్ధమైంది. నవంబర్ 1న న్యూఢిల్లీలోని చరిత్రాత్మక రాంలీలా మైదానంలో జరగనున్న 'ఓట్ బచావో – దేశ్ బచావో' మెగా నేషనల్ ర్యాలీ ఏర్పాట్ల కోసం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సోమవారం అధికారికంగా ప్రత్యేక సమన్వయ కమిటీని ప్రకటించింది. రాష్ట్రానికి చెందిన సీనియర్ పార్లమెంట్ సభ్యులు, మంత్రులతో కూడిన ఐదుగురు కీలక నేతలకు ఈ బాధ్యతలు అప్పగించారు.

డాక్టర్ మల్లు రవి – ఎంపీ అండ్ కన్వీనర్, తెలంగాణ ఎంపీల ఫోరం
పొన్నం ప్రభాకర్ – రాష్ట్ర మంత్రి
వాకిటి శ్రీహరి – రాష్ట్ర మంత్రి
పోరిక బలరాం నాయక్ – మహబూబాబాద్ ఎంపీ
చామల కిరణ్ కుమార్ రెడ్డి – భువనగిరి ఎంపీ



## మూన్ బేబి 5973 ఇన్‌స్టా ఐడీతో మల్లారెడ్డి స్టూడెంట్‌కు వల..

**త్రినేత్ర న్యూస్:** ఇటీవల హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన హనీట్రాప్ కేసు విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నిందితుడు కొండభత్తుల పవన్ కుమార్ 'Moon baby 5973' ఇన్‌స్టా ఐడీతో మల్లారెడ్డి స్టూడెంట్‌ను ట్రాప్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. బాధితుడిపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయని.. ఈ కోణంలోనూ విచారిస్తున్నట్లు పేర్కొన్నారు. మాట వినకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులకు దిగినట్లు తేలిందన్నారు. తాజాగా ఈ కేసుకు సంబంధించిన వివరాలను పోలీసు అధికారులు వెల్లడించారు. రెండేళ్ల క్రితం చిట్‌ఫండ్స్ సంస్థలో పనిచేసిన పవన్‌కుమార్.. రుణాల పేరుతోనూ మరో మహిళను మోసం చేసినట్లు తేల్చారు. దీంతో పాటు ఏపీ, కర్ణాటక, కేరళ, తమిళనాడులోనూ బాధితులు ఉన్నారు. పాక్, టర్కీ, కెనడాలోనూ పలువురిని ట్రాప్ చేశాడు. బాధితుల్లో పోలీసులు, వైద్యులు, వ్యాపారులు ఉన్నారు. ఫొటోలు, వీడియోలతో బాధితులను బెదిరింపులకు గురి చేసేవాడు అని పోలీసులు వెల్లడించారు.



## మాదాపూర్‌లో వ్యభిచారం..

- ఉజ్జెకిస్థాన్ మహిళలు అరెస్ట్

**త్రినేత్ర న్యూస్ :** హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో వ్యభిచార దందాలు కొనసాగుతూనే ఉన్నాయి. నిత్యం ఎక్కడో ఒకచోట వ్యభిచార ముఠా పట్టుబడుతూనే ఉంది. తాజాగా మాదాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని చంద్రనాయక్ తండాలో ఓ వ్యభిచార ముఠా గుట్టురట్టయింది. ఓ సర్వీసు అపార్ట్‌మెంట్‌లోని రూమ్ నంబర్ 204లో ఈ దందా కొనసాగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ముగ్గురు ఉజ్బెకిస్థాన్ మహిళలను కూకట్‌పల్లి, మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులు అరెస్టు చేశారు. అయితే ఈ ముగ్గురు మహిళలు లేకుండా పాస్ పోర్టు, వీసా లేకుండానే నేపాల్ మీదుగా ఇండియాలోకి ప్రవేశించినట్లు విచారణలో తేలింది. ఈ దందా వెనుకాల ఢిల్లీకి చెందిన నాయక్ అనే వ్యక్తి ఉన్నట్లు పోలీసులు కనుగొన్నారు. ఉజ్బెకిస్థాన్ నుంచి మహిళలను అక్రమంగా తీసుకువచ్చి.. వ్యభిచారం చేయిస్తున్నట్లు తేలింది.

# తుమ్మిడిహెట్టి వద్ద నీళ్లే లేవు

- మనకు అవసరమైన నీటి లభ్యత లేదు
- ఈ విషయాన్ని 2015లోనే
 కేంద్ర జల సంఘం రూఢీ చేసింది
- మీ అసమర్థత వల్లే ఈ కరువు
- ప్రభుత్వంపై హరీశ్ రావు తీవ్ర విమర్శలు

**త్రినేత్ర న్యూస్ :**




తుమ్మిడి హెట్టి వద్ద.. తెలంగాణ ఆశిస్తున్నన్ని నీళ్లు లేవని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఈ విషయాన్ని 2015లో కేంద్ర జల సంఘం స్పష్టంగా చెప్పిందని గుర్తు చేశారు. సోమవారం తెలంగాణ భవన్ లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎల్ నినో పై ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా దుయ్యబట్టారు. "2015 ఫిబ్రవరిలోనే కేంద్ర జల సంఘం తెలంగాణకు లేఖ రాసింది. మనకు అవసరమైనన్ని నీళ్లు లేవని ఆ లేఖలో స్పష్టంగా చెప్పింది. అందుకే ప్రత్యామ్నాయం కూడా చూసుకోవాలంటూ సలహా ఇచ్చింది. మీరు తుమ్మిడిహెట్టి సాధించుకొని వస్తే మేం స్వాగతిస్తాం. కానీ ఇప్పటికే 240 టీఎంసీలు ఎత్తిపోసే సామర్థ్యం ఉన్న కాళేశ్వరం ఎత్తిపోతల వ్యవస్థను ఉద్దేశ పూర్వకంగా పక్కన పెట్టి.. జనాల్ని కరువు కరువు అని ఎందుకు బెదిరిస్తున్నారు? కేవలం కేసీఆర్ గారికి పేరు వస్తదనే రాజకీయ కక్షతోనే కన్నెపల్లి మోటర్లు ఆన్ చేయకుండా, నీళ్లు ఎత్తకుండా కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు లేని కరువును రుద్దుతోంది. 'కరువు కరువు' అని ప్రజల మీద లేని ప్రేమను చూపుతూ, మనుషులు, పక్షులు చచ్చి పోతాయని ప్రజలను భయపెడుతున్నారు... కానీ నీళ్లుండి కూడా శ్రీశైలంలో మరియు కల్వకుర్తిలో నీళ్లు ఎత్తలేని అసమర్థత ఈ కాంగ్రెస్ ప్రభుత్వానిది" అని విమర్శించారు.

**ఎన్ని మోటార్లు నడుపుతున్నారు**

ఎత్తిపోతల పథకాల్లో ఎక్కడ ఎన్ని పంపులు ఎన్ని గంటలు నడుపుతున్నారో ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. "కన్నెపల్లి పంప్ హౌస్ దగ్గరకి మా కేటీఆర్ గారు, మా ఎమ్మెల్యేలు వెళ్లి మరి చెప్పారు పంపులు ఆన్ చేయమని...రిటైర్డ్ ఇంజనీర్లు సైతం మోటర్లు ఆన్ చేసి నీళ్లు ఎత్తమని చెబితే... ఆ రిటైర్డ్ ఇంజనీర్లను బెల్ట్ తో కొడతామని, జైల్లో పెడతాను అని రేవంత్ రెడ్డి అనటం ఎంత వరకు సమంజసం??ఐదు మోటర్లు ఉన్న కల్వకుర్తిలో ప్రస్తుతం కేవలం రెండే మోటర్లు నడుపుతున్నారు. రోజుకు 24 గంటలు నడపాల్సింది పోయి, కేవలం 12 గంటలే నడిపిస్తున్నారు. శ్రీశైలంలో తెలంగాణ ఎంత వాడింది, ఆంధ్రప్రదేశ్ ఎంత వాడింది, కల్వకుర్తి మోటర్లు ఎన్ని రోజులు, ఎన్ని గంటలు నడిపారో ప్రభుత్వం వెంటనే వైట్ పేపర్ విడుదల చేయాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టిసీమ మోటార్లు 100 రోజులు, 24 గంటలు నిరాటంకంగా నడిచి గోదావరి–కృష్ణా డెల్టాను కాపాడుకుంటున్నాయి. మరి అదే గోదావరి నదిపై సమ్మక్క బ్యారేజ్ కట్టి, దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసి మీ చేతిలో పెడితే మీరేం చేస్తున్నారు??సమ్మక్క బ్యారేజ్ నుంచి దేవాదులలో మీరు ఎన్ని రోజులు మోటార్లు నడిపారు?? ఎన్ని గంటలు నడిపారు?? ఎన్ని నీళ్లు ఎత్తారో దమ్ముంటే ఒక వైట్ పేపర్ రిలీజ్ చేయండి." అని డిమాండ్ చేశారు.

# దళారులకే ధాన్యం అమ్ముకోండి..

- రైతులకు మంత్రి పొన్నం సూచన

**త్రినేత్ర న్యూస్ :**



వరి ధాన్యం విక్రయం విషయంలో ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కంటే దళారులు ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తే వారికే అమ్ముకోవచ్చని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ రైతులకు సూచించారు. సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో వరి ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మంత్రి మాట్లాడారు.

హుస్నాబాద్ నియోజకవర్గం వ్యాప్తంగా సోమవారం నుంచే 136 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. సాగునీటి కొరత వల్ల ఈ సీజన్‌లో వరి సాగు తగ్గడంతో ధాన్యానికి మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉందన్నారు. రైతుల కళ్లాల వద్దకే దళారులు వస్తున్నారని, ఒకవేళ ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కంటే దళారులు ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తే నిర్మొహమాటంగా అమ్ముకోవచ్చని రైతులకు సూచించారు. ఇక రాష్ట్రంలో 300కు పైగా కరువు మండలాలు ఉన్నాయన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన సహాయం కోసం అక్టోబర్ 28న అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

2007లోనే శ్రీకారం చుట్టిన గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేశామని మంత్రి స్పష్టం చేశారు. స్థానిక ప్రజలు భూములు త్యాగం చేయడం వల్లే నేడు వేలాది ఎకరాలకు సాగునీరు అందుతోందని, భూమి కోల్పోయిన ప్రతి ఒక్కరి త్యాగాన్ని ప్రభుత్వం తప్పక గుర్తిస్తుందని హామీ ఇచ్చారు.

# చమన్ సింగ్, సంగిశెట్టిలకు మల్లావఝుల పురస్కారం

- వచ్చేనెల 3న ప్రదానం
- ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

**త్రినేత్ర న్యూస్:**



ప్రముఖ కవి, కథా రచయిత చమన్ సింగ్‌ను, సాహిత్య విమర్శకులు, పరిశోధకులు సంగిశెట్టి శ్రీనివాస్ లను ప్రముఖ కవి, గీత రచయిత, గోదావరి గొంతుక మల్లావఝుల సదాశివుడు స్మారక పురస్కారానికి ఎంపిక చేసినట్లు సమితి గౌరవ అధ్యక్షుడు కవి, గాయకుడు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ప్రకటించారు. తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో వచ్చేనెల 3న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా అవార్డు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో మల్లావఝుల సదాశివుడు రాసిన 'తలాపునా పారుతుంది గోదారీ... నా చేనూ నా చెలకా ఎడారి' పాట తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తిచూపిందని గుర్తు చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ దేశపతి వివరాలను వెల్లడించారు.

**ఏమున్నదక్కో.. ఈ ఊళ్లె నాకింక ఏమున్నదక్కా**

ఈ సందర్భంగా దేశపతి మాట్లాడుతూ.. కుల వివక్షపై మల్లావఝుల రాసిన 'ఎన్నాళ్లు ఈ వెలివేత, ఎన్నాళ్లు ఈ వలపోత' అనే గేయం సమాజాన్ని పట్టి పీడిస్తున్న జాఢ్యాన్ని కళ్లకు కట్టినట్లు చూపిందన్నారు. తెలంగాణ ప్రజల్లో పోలీసుల హింసతో వలసపోతున్న యువతరం 'ఏమున్నదక్కో.. ఏమున్నదక్కా.. ముల్లె సదురుకున్న, ఎల్లిపోతా ఉన్న, ఈ ఊళ్లె నాకింక ఏమున్నదక్కా..' అనే పాటతో పాటు, వరకట్న వేధింపులపై 'పారాణి ఆరలేదు చెల్లెలా.. నీకు నూరేళ్లు నిండినాయా చెల్లెలా..' పాటలు ఆనాటి సమాజాన్ని పట్టి పీడిస్తున్న వరకట్న కోరల జాఢ్యంపై మల్లావఝుల తిరుగుబాటు గేయాలుగా ప్రజల హృదయాల్లో నిలిచిపోయాయన్నారు.

**అణగారిన వర్గాలపై రచనలకు..**

ఏటా మల్లావఝుల పేరిట స్మారక పురస్కారాన్ని అణగారిన కులాల పక్షాన రచనలు చేసి, ప్రజల గొంతుకై నిలిచిన ప్రజా కవులకు ఇస్తున్నట్లు ఎమ్మెల్సీ దేశపతి వివరించారు. మల్లావఝుల స్మారక పురస్కారాన్ని అందుకున్న వారిలో ప్రజా గొంతుకలై నిలిచిన కవులు గూడ అంజన్న, జయరాజు, గోరేటి వెంకన్న, నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్, విమలక్క, నిస్సార్, మిట్టపల్లి సురేందర్, ఏపూరి సోమన్న, తైదల అంజన్న, వజ్జల శివకుమార్, బెల్లి యాదయ్య, ఆయాచితం శ్రీధర్, మోహన్ ఋషి, మునాస వెంకట్, వనపట్ల సుబ్బయ్య, కోడూరి విజయ్ కుమార్ తదితరులు ఉన్నారని తెలంగాణ వికాస సమితి అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి మల్లావఝుల విజయానంద్ వెల్లడించారు.



## ఢిల్లీలో కుప్పకూలిన మరో భవనం.. ఇద్దరు మృతి

**త్రినేత్ర న్యూస్:** ఢిల్లీలో మరో భవనం కుప్పకూలింది. దేశ రాజధానిలోని హర్ష్ విహార్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఒక బిల్డింగ్‌లో రెండు స్లాబ్‌లు ఆదివారం సాయంత్రం కూలిపోయాయి. దీంతో ఇద్దరు వ్యక్తులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. దీంతో ఎన్‌డీఆర్‌ఎఫ్ , ఢిల్లీ అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, విపత్తు నిర్వహణ బృందాలు వారిని బయటకు తీసి హాస్పిటల్‌కు తరలించారు. అయితే అప్పటికే వారు మరణించారని వైద్యులు వెల్లడించారు.. ఈ నెల 7న సత్య సీమాపురి ప్రాంతంలోని సత్యానికేతన్‌లో ఐదంతస్తుల భవనం కూలిపోయిన విషయం విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఏడుగురు మరణించిన విషయంలో మరువక ముందే మరో బిల్డింగ్ కూలిపోవడం గమనార్హం.



## కోటాలో ఆగని ఆత్మహత్యలు..

- **మరో విద్యార్థి సూసైడ్**

**త్రినేత్ర న్యూస్ :** ఉన్నత చదువు, ఉద్యోగాల కోచింగ్‌కు ప్రసిద్ధిగాంచిన రాజస్థాన్ కోటా లో విద్యార్థుల ఆత్మహత్య లు ఆగడం లేదు. తాజాగా 16 ఏళ్ల నీట్ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. తన హాస్టల్ గదిలో ఉరేసుకుని తనువు చాలించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ లోని శివపురికి చెందిన విద్యార్థి ఆరు నెలల క్రితమే కోటాకు వచ్చాడు. మహావీర్ నగర్-1 ప్రాంతంలోని పెయింగ్ గెస్ట్‌లో ఉంటూ స్థానికంగా ఉన్న కోచింగ్ సెంటర్‌లో జేఈఈ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాడు. అయితే, రాత్రి భోజనం తర్వాత సదరు విద్యార్థి తన గది నుంచి బయటకు రాలేదు. దీంతో అనుమానం వచ్చిన తోటి విద్యార్థులు అతడి రూమ్ తలుపు తట్టారు. అయినా ఎంతకీ తలుపు తెరవకపోవడంతో వాళ్లు హాస్టల్ యామజమాన్యానికి సమాచారం ఇచ్చారు. వాళ్లు వచ్చి తలుపు బద్దలు కొట్టి చూడగా.. అప్పటికే సదరు విద్యార్థి శవమై కనిపించాడు. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు.



## మోదీ తండ్రిని అంత మాటంటవా?

- **ఖర్గే ఇంటిని చుట్టుముట్టిన బీజేపీ నేతలు**

**త్రినేత్ర న్యూస్ :** ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చేసిన ఘాటు వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఖర్గే వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని, పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చింది. సోమవారం న్యూఢిల్లీలోని రాజాజీ మార్గ్‌లో ఉన్న ఖర్గే నివాసాన్ని ముట్టడించేందుకు ఢిల్లీ బీజేపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీగా బయలుదేరారు. ఖర్గే, రాహుల్ గాంధీలకు వ్యతిరేకంగా బీజేపీ శ్రేణులు నినాదాలతో హోరెత్తించాయి.

# ఆ మాట మోదీకి చెప్పండి..

- **30 సెకన్లలో నిరసనలు ఆగిపోతాయి..**
- **జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలంటూ పీఎం కు చెప్పాలని ఢిల్లీ వ్యాపారులకు రాహుల్ సూచన**



**ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్ లో ఇండియా కూటమి నవంబర్ 1న నిర్వహించ తలపెట్టిన ర్యాలీని వాయిదా వేయాలని 'ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ' కోరిన విషయం తెలిసిందే. దీపావళి షాపింగ్ సీజన్‌లో ఈ ర్యాలీ వల్ల వ్యాపారం దెబ్బతింటుందని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు ప్రతిపక్ష నేతకు లేఖ రాసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వ్యాపారుల ఆందోళనపై రాహుల్ గాంధీ తాజాగా స్పందించారు. ఓటుచోరీ ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని ప్రధాని మోదీకి చెబితే 30 సెకన్లలో నిరసనలు ఆగిపోతాయని రాహుల్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.**
**- త్రినేత్ర న్యూస్**

"ఢిల్లీలోని ప్రతి వ్యాపారికీ నేను చెప్పేది ఒక్కటే.. ప్రభుత్వం మెట్రోను నిలిపివేసింది, రోడ్లను బ్లాక్ చేసింది. రాజధానిని లాక్‌డౌన్ చేసింది. ఓటు చోరీ జరిగితే ఏదీ సురక్షితం కాదు. మీ దుకాణాలు, మీ పొదుపు, మీ పిల్లల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. ఓటుచోరీ ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించమని మీరు ప్రధానికి చెప్పండి. అప్పుడు 30 సెకన్లలో నిరసనలు ఆగిపోతాయి" అని రాహుల్ వ్యాఖ్యానించారు.

**వ్యాపార వర్గాల ఆందోళనలు..**
ఈ నేపథ్యంలో సీఈసీ రాజీనామాకు డిమాండ్ చేస్తూ రామ్‌లీలా మైదాన్ వద్ద ప్రతిపక్షాలు ఆందోళనకు పిలుపునిచ్చి న విషయం తెలిసిందే. అయితే, పండుగ సీజన్‌లో ఈ ఆందోళనల కారణంగా వ్యాపారం దెబ్బతింటుందని వ్యాపార వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ మేరకు నిరసనను విరమించుకోవాలని కోరుతూ సీటీఐ చైర్మన్ బ్రిజేష్ గోయల్.. రాహుల్ గాంధీకి లేఖ రాశారు. నవంబర్ 6న ధన త్రయోదశి, నవంబర్ 8న దీపావళి, నవంబర్ 10న భాయ్ దూజ్ పండుగలు రానున్నాయని ప్రస్తావించారు.

**రూ.25,000 కోట్ల వ్యాపారం..**
పండగల సమయంలో బంగారం, వెండి, ఎలక్ట్రానిక్స్, దుస్తులు, గృహోపకరణాలు, డ్రైఫ్రూట్స్, స్వీట్లు, ఆటోమొబైల్స్, రియల్ ఎస్టేట్, గిఫ్ట్ ఐటమ్స్ రంగాల్లో ఢిల్లీలో సుమారు రూ.25,000 కోట్ల వ్యాపారం జరుగుతుందని తెలిపారు. పండుగకు వారం ముందు నుంచే మార్కెట్లలో రద్దీ విపరీతంగా పెరుగుతుందని చెప్పారు. పండుగ సీజన్‌లో వ్యాపార కార్యకలాపాలను కాపాడుకోవడాని కి నవంబర్ 10 తర్వాత ర్యాలీ నిర్వహించాలని కోరారు.

## మా కుటుంబాన్ని అంతం చేసేందుకు కుట్ర..

- **రూ.600 కోట్లతో డీల్..**
- **సీఎం డీకేపై కేంద్ర మంత్రి సంచలన ఆరోపణలు**

**కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పై కేంద్ర మంత్రి, జనతాదళ్ నేత హెచ్‌డీ కుమారస్వామి సంచలన ఆరోపణలు చేశారు. మాజీ ప్రధాని దేవెగౌడ కుటుంబాన్ని రాజకీయంగా దెబ్బతీసేందుకు సీఎం డీకే రూ.600 కోట్లతో డీల్ కుదుర్చుకున్నారని ఆరోపించారు. తన కుటుంబాన్ని టార్గెట్ చేస్తూ డీకే వరుస కుట్రలు పన్నుతున్నారని పేర్కొన్నారు. ఆ కుట్రల్లో రూ.600 కోట్ల డీల్ కూడా భాగమని సంచలన ఆరోపణలు చేశారు.**
**- త్రినేత్ర న్యూస్**



"మా కుటుంబాన్ని అంతం చేయాలని ఆదేశించింది మరెవరో కాదు. ప్రస్తుత ముఖ్యమంత్రే (డీకే శివకుమార్‌ను ఉద్దేశిస్తూ). మా కుటుంబాన్ని రాజకీయంగా దెబ్బతీయడానికి ఆయన ఎన్నో కుట్రలు పన్నారు. అందులో రూ. 600 కోట్ల సుపారీ డీల్ కూడా ఒకటి" అని విలేకరులతో మాట్లాడుతూ కుమారస్వామి సంచలన ఆరోపణలు చేశారు. అంతేకాదు, మాజీ సీఎం సిద్ధరామయ్యపై జరిగిన స్టింగ్ ఆపరేషన్ కేసులో తనను, తన పార్టీని ఇరికించేందుకు సీఎం శివకుమార్, హోంమంత్రి ప్రియాంక్ ఖర్గే కుట్ర పన్నుతున్నారని ఆయన మండిపడ్డారు.

2023లో జరిగిన ఈ స్టింగ్ ఆపరేషన్ వెనుక కాంగ్రెస్ అంతర్గత కుట్ర ఉందని కుమారస్వామి అనుమానం వ్యక్తం చేశారు. సిద్ధరామయ్యను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించి తాను సీఎం కావడానికి డీకే శివకుమార్ ఉద్దేశపూర్వకంగా ఈ స్టింగ్ ఆపరేషన్‌ను ఒక సాధనంగా వాడుకున్నారని చెప్పారు. ఈ విషయం శివకుమార్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలకు ముందే తెలుసని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరపాలని కుమారస్వామి డిమాండ్ చేశారు.

## అమిత్ షాపై గెలిచిన రాహుల్ గాంధీ..

- **పరువు నష్టం కేసు కొట్టివేత**

**కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కి భారీ ఊరట లభించింది. 2018లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువునష్టం కేసులో యూపీలోని సుల్తాన్‌పూర్ కోర్టు ఆయన్ని నిర్దోషిగా ప్రకటించింది. ఈ మేరకు పరువు నష్టం కేసును డిస్మిస్ చేసింది.**
**- త్రినేత్ర న్యూస్**



2018 లో బెంగళూరు లో జరిగిన విలేక రుల సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా పై రాహుల్ గాంధీ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. అమిత్ షా ఓ హత్య కేసులో నిందితుడని రాహుల్ ఆరోపించారు. ప్రతిపక్ష నేత ఆరోపణ లను బీజేపీ నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ వ్యాఖ్యలు అమిత్ షా ప్రతిష్ఠకు భంగం కలిగిం చాయని ఆరోపిస్తూ బీజేపీ నేత విజయ్ మిశ్రా అదే ఏడాది ఆగస్టు 4న సుల్తాన్‌పూర్ కోర్టులో పరువు నష్టం దాఖలు చేశారు. ఈ కేసులో విచారణకు హాజరు కావాలని 2023లో కోర్టు రాహుల్‌ను ఆదేశించింది. 2024 ఫిబ్రవరి 20న రాహుల్ కోర్టు ఎదుట విచారణకు హాజరయ్యారు. వ్యక్తిగత పూచీకత్తు, హామీ పత్రాలను సమర్పించిన తర్వాత ఆయనకు బెయిల్ మంజూరైంది.

2024 జులైలో కోర్టులో రాహుల్ వాంగ్మూలాన్ని నమోదు చేయగా.. అదే ఏడాది అక్టోబర్‌లో ఫిర్యాదుదారుడి వాంగ్మూలాన్ని కూడా నమోదు చేశారు. ఇక పరువు నష్టం ఫిర్యాదుపై వాదనలు ఈ ఏడాది అక్టోబర్‌లో ముగిశాయి. దీంతో ఇవాళ తుది తీర్పు వెలువడింది. ఈ కేసుపై విచారణ జరిపిన ప్రత్యేక ప్రజా ప్రతినిధుల కోర్టు.. రాహుల్‌ని నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది.



## పార్లమెంట్‌లో అగ్నిప్రమాదం..

**త్రినేత్ర న్యూస్ : దేశ రాజధాని ఢిల్లీ లోని పార్లమెంట్ సమీపంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కేంద్ర పరిపాలనా భవనం నార్త్‌బ్లాక్ నుంచి నల్లటి పొగ వెలువడింది. అప్రమత్తమైన సిబ్బంది, అధికారులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. రంగంలోకి దిగిన ఫైర్ సిబ్బంది ఆరు ఫైరింజన్లతో పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.**
అయితే, అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ భవనం పై కప్పుపై పునరుద్ధరణ పనులు జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఆ సమయంలో అక్కడ కొందరు కార్మికులు కూడా ఉన్నారని చెప్పారు. నార్త్ బ్లాక్ పైకప్పుపై అమర్చిన ఏసీ బాయిలర్‌లో అగ్నిప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

## స్టాక్ మార్కెట్స్

| | | |
|---|---|---|
| NIFTY | - ▲ | 22,753 |
| SENSEX | - ▲ | 73,606 |

### డాలర్ వర్సెస్ రూపాయి

1 డాలర్ కు
**95.19** రూపాయలు

### బులియన్ మార్కెట్

- 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) - రూ.1,42,750
- 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) - రూ.1,30,850
- వెండి ధర (ఒక కిలో) - రూ.2,20,000



# త్వరలో.. వాట్సాప్‌లో స్పెషల్ రీల్స్ ఆప్షన్

**వాట్సాప్ వినియోగదారులకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా మెటా సంస్థ కొత్త ఫీచర్‌ను పరీక్షిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో చూసిన రీల్స్‌ను స్నేహితులు, కుటుంబ సభ్యులతో సులభంగా పంచుకునేందుకు వాట్సాప్ చాట్ అటాచ్‌మెంట్ మెనూలో ప్రత్యేకంగా రీల్స్ ఆప్షన్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. దీని ద్వారా వినియోగదారులు ఇన్‌స్టాగ్రామ్‌లో ఇటీవల చూసిన, లైక్ చేసిన లేదా సేవ్ చేసిన వీడియోలను వెతకకుండానే నేరుగా వాట్సాప్ చాట్‌లో షేర్ చేయవచ్చు. వాట్సాప్ ఆండ్రాయిడ్ బీటా వెర్షన్ 2.26.42.9లో ఈ ఫీచర్‌ను గుర్తించారు. ప్రస్తుతం ఎంపిక చేసిన బీటా వినియోగదారులకు దశలవారీగా అందిస్తున్నారు.**

**ఎప్పటి నుంచి అందుబాటులోకి?**

ప్రస్తుతం గూగుల్ ప్లే స్టోర్ ద్వారా అందుబాటులో ఉన్న అనుకూల ఆండ్రాయిడ్ బీటా వెర్షన్‌ను ఉపయోగిస్తున్న కొంతమంది పరీక్షా వినియోగదారులకు మాత్రమే ఈ ఫీచర్ అందుబాటులో ఉంది. అయితే, సంబంధిత బీటా వెర్షన్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నంత మాత్రాన ఈ ఫీచర్ అందరికీ కనిపిస్తుందని చెప్పలేం. వాట్సాప్ దీన్ని దశలవారీగా ప్రారంభిస్తోంది. ఈ ఫీచర్‌ను విస్తృత స్థాయిలో ఎప్పుడు అందుబాటులోకి తీసుకువస్తారనే విషయంపై సంస్థ ఇంకా స్పష్టత ఇవ్వలేదు. అలాగే, ఐఓఎస్ వినియోగదారులకు ఈ సదుపాయం ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తుందనే విషయాన్ని కూడా వెల్లడించలేదు. చాట్ అటాచ్‌మెంట్ మెనూలో ఈ ఆప్షన్ కనిపించని వినియోగదారులు తమ ఖాతాకు అందుబాటులోకి వచ్చే వరకు వేచి చూడాల్సి ఉంటుంది.




గతంలో ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను వాట్సాప్‌తో అనుసంధానించిన వినియోగదారులు మీడియా పికర్ ద్వారా ఇన్‌స్టాగ్రామ్ కంటెంట్‌ను యాక్సెస్ చేసుకునే అవకాశం ఉండేది. అయితే, తమకు కావాల్సిన రీల్‌ను గుర్తించడానికి అందుబాటులో ఉన్న వివిధ మీడియా విభాగాలను పరిశీలించాల్సి వచ్చేది. కొత్త షార్ట్‌కట్ ద్వారా చాట్ నుంచే ప్రత్యేక స్క్రీన్‌ను తెరిచి ఇన్‌స్టాగ్రామ్ కార్యకలాపాలను పరిశీలించవచ్చు. ఇందులో ఇటీవల చూసిన వీడియోల కోసం రీసెంట్స్, భవిష్యత్తులో చూడడానికి భద్రపరిచిన వీడియోల కోసం సేవ్డ్, లైక్ చేసిన వీడియోల కోసం లైక్డ్ అనే విభాగాలు ఉంటాయి. దీంతో వినియోగదారులు తమకు కావాల్సిన రీల్స్‌ను సులభంగా గుర్తించవచ్చు. కావాల్సిన రీల్‌ను గుర్తించిన తర్వాత దాన్ని ఎంపిక చేసుకుని వ్యక్తిగత చాట్‌లో లేదా గ్రూప్ చాట్‌లో నేరుగా షేర్ చేయవచ్చు. ఇప్పటికే ఉన్న షేరింగ్ సదుపాయాన్ని మరింత సులభంగా ఉపయోగించుకునేలా చేయడమే ఈ మార్పు ప్రధాన ఉద్దేశం.




## జియో, పారస్ హెల్త్‌కేర్ ఐపీఓ అలాట్‌మెంట్..

- **స్టేటస్ ఇలా చెక్ చేసుకోండి..**

జియో ప్లాట్‌ఫామ్స్, పారస్ హెల్త్‌కేర్ ఐపీఓల షేర్ల కేటాయింపు ప్రక్రియ సోమవారం పూర్తయ్యే అవకాశం ఉంది. ఈ రెండు పబ్లిక్ ఇష్యూలకు దరఖాస్తు చేసుకున్న ఇన్వెస్టర్లు తమ షేర్లు కేటాయించబడ్డాయో లేదో ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చు. బీఎస్ఈ, ఎన్ఎస్ఈ వెబ్‌సైట్లతోపాటు సంబంధిత రిజిస్ట్రార్ల వెబ్‌సైట్ల ద్వారా అలాట్‌మెంట్ స్టేటస్‌ను తనిఖీ చేసుకోవచ్చు. జియో ప్లాట్‌ఫామ్స్, పారస్ హెల్త్‌కేర్ ఐపీఓలు అక్టోబర్ 21న సబ్‌స్క్రిప్షన్‌కు ప్రారంభమై, అక్టోబర్ 23న ముగిశాయి. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు మొత్తం 12.45 రెట్లు సబ్‌స్క్రిప్షన్ లభించగా, పారస్ హెల్త్‌కేర్ ఐపీఓ 1.92 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. జియో ప్లాట్‌ఫామ్స్ ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.1,065 నుంచి రూ.1,119గా నిర్ణయించింది. పారస్ హెల్త్‌కేర్ షేరు ధరల శ్రేణి రూ.660 నుంచి రూ.693గా ఉంది. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓలో కొత్త షేర్ల జారీ ఉండగా, పారస్ హెల్త్‌కేర్ రూ.1,450 కోట్ల పబ్లిక్ ఇష్యూలో రూ.500 కోట్ల విలువైన షేర్ల జారీ ఉన్నాయి.

# 2026లో రూ.3.08 లక్షల కోట్లు వెనక్కి..

- **భారత మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడిదారుల భారీ నిష్క్రమణ..**

**భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడిదారులు భారీగా నిధులను వెనక్కి తీసుకుంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి, భారత కంపెనీల ఆదాయ వృద్ధిపై పెరుగుతున్న ఆందోళనలు ఈ పరిణామాలకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ లిమిటెడ్ (సీడీఎస్ఎల్) గణాంకాల ప్రకారం, అక్టోబర్ నెలలో ఇప్పటివరకు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) భారత మార్కెట్ల నుంచి నికరంగా రూ.48,056 కోట్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 2026లో ఇప్పటివరకు వారి మొత్తం ఉపసంహరణలు రూ.3.08 లక్షల కోట్లకు చేరుకున్నాయి. 2025లో ఏడాది మొత్తం విదేశీ పెట్టుబడిదారులు ఉపసంహరించుకున్న రూ.1.66 లక్షల కోట్లతో పోలిస్తే, ప్రస్తుత ఏడాది ఉపసంహరణలు ఇప్పటికే దాదాపు రెట్టింపయ్యాయి.**



జూలైలో రూ.20,200 కోట్లు, ఆగస్టులో రూ.29,631 కోట్లను భారత మార్కెట్లలో పెట్టుబడిగా పెట్టిన విదేశీ ఇన్వెస్టర్లు, ఆ తర్వాత తమ వ్యూహాన్ని మార్చుకున్నారు. సెప్టెంబర్‌లో రూ.35,861 కోట్లను వెనక్కి తీసుకోగా, అక్టోబర్‌లో విక్రయాల వేగాన్ని మరింత పెంచారు. భారత ఆర్థిక పరిస్థితులను అంచనా వేస్తున్న పెట్టుబడిదారులకు ముడిచమురు ధరలు కీలక అంశంగా మారాయి. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరగడంతో ముడిచమురు ధరలు బ్యారెల్‌కు సుమారు 114 డాలర్లకు చేరుకున్నాయి. దీనివల్ల భారత్ దిగుమతి వ్యయాలు పెరగడం, ద్రవ్యోల్బణం అధికమవడం, కంపెనీల లాభదాయకత తగ్గే అవకాశం ఉండడంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.మీరా మనీ సహ వ్యవస్థాపకుడు ఆనంద్ కె.రాఠీ కూడా అధిక చమురు ధరలతోపాటు కంపెనీల ఆదాయ వృద్ధిపై నెలకొన్న ఆందోళనలను ప్రస్తావించారు. అమెరికాలో వడ్డీ రేట్లు అధిక స్థాయిలో కొనసాగుతుండడం మరో సవాలుగా మారింది.

**జియో ఐపీఓ ఒక కారణం..?**

చాయిస్ వెల్త్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజీ ఆఫీసర్ ధీరజ్ గౌర్ మాట్లాడుతూ అధిక చమురు ధరలు,విదేశీ పెట్టుబడుల ఉపసంహరణకు ప్రధాన కారణాలని పేర్కొన్నారు. దీనికి తోడు రూ.30,213 కోట్ల విలువైన జియో ప్లాట్‌ఫామ్స్ ప్రారంభ పబ్లిక్ ఆఫరింగ్ తాత్కాలికంగా మార్కెట్‌లోని పెట్టుబడి నిధులను ఆకర్షించడం కూడా ఒత్తిడిని పెంచిందని వివరించారు

# బ్రెజిల్ అధ్యక్షుడిగా నాలుగోసారి..

- **మరోసారి అధికారంలోకి లూలా డా సిల్వా**

**బ్రెజిల్ అధ్యక్షుడిగా లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వా ఘన విజయం సాధించారు. ఫ్లావియో బొల్సోనారోతో జరిగిన హోరాహోరీ పోరులో 81 ఏండ్ల లూలా గెలుపొందారు. దీంతో ఆయన బ్రెజిల్ అధ్యక్షుడిగా ఎన్నికవడం ఇది 4వ సారి ఎన్నకయ్యారు. 2003 నుంచి 2010 వరకు రెండు పర్యాయాలు అధ్యక్షుడిగా పనిచేసిన ఆయన, 2023లో మరోసారి అధికారంలోకి వచ్చారు.**



ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సమయానికి లూలాకు 51.8 శాతం ఓట్లు రాగా, ఫ్లావియోకు 48.24 శాతం ఓట్లు వచ్చాయి. దీంతో లూలా మరోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను తీవ్రంగా విమర్శించే లూలా.. తాజా విజయంతో తిరిగి అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. దీంతో గెటులియో వర్గాస్ తర్వాత బ్రెజిల్ చరిత్రలో అత్యధిక కాలం అధ్యక్షుడిగా పనిచేసిన రెండో వ్యక్తిగా లూలా రికార్డు సృష్టించారు. ఈ విడత పూర్తయ్యేసరికి ఆయన మొత్తం 16 ఏళ్ల పాటు అధికారంలో ఉన్నట్లవుతుంది. ఇప్పటికే ప్రపంచంలోనే అత్యంత వృద్ధ నాయకులలో ఒకరైన లూలా, 2030లో తన కొత్త పదవీ కాలం ముగిసే సమయానికి 85 ఏండ్లకు చేరుకుంటారు. అమెరికా ఖండంలోనే అత్యంత వృద్ధ అధ్యక్షులుగా ఉన్న 80 ఏండ్ల డొనాల్డ్ ట్రంప్ , నికరాగ్వా అధ్యక్షుడు డానియల్ ఒర్టెగాల సరసన లూలా చేరారు.

1989లో బ్రెజిల్‌లో ప్రత్యక్ష అధ్యక్ష ఎన్నికలు ప్రారంభమైనప్పటి నుంచి, మొదటి విడత ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచి, ఆ తర్వాత రన్–ఆఫ్ (రెండో విడత)లో గెలిచిన మొదటి అభ్యర్థిగా లూలా నిలిచారు. 1970లలో కార్మిక సంఘం నాయకుడిగా ప్రస్థానం ప్రారంభించిన ఆయన వర్కర్స్ పార్టీ స్థాపనలో కీలక పాత్ర పోషించారు.




# మిడ్ క్యాప్ షేర్లతో రాబడి

**మ్యూచువల్ ఫండ్‌ను ఎంచుకునే సమయంలో పెట్టుబడిదారులు ప్రధానంగా రాబడులు, పెట్టుబడి స్థిరత్వానికి ప్రాధాన్యం ఇస్తారు. రెండు విభిన్న పెట్టుబడి సాధనాలను కలిపి పెట్టుబడి పెట్టడమే హైబ్రిడ్ ఇన్వెస్టింగ్ విధానం. ఇందులో ఒక్కో ఆస్తి వర్గం ఒక్కో విధమైన ప్రయోజనాన్ని అందిస్తుంది.**

పెట్టుబడుల విలువ పెరగడం ద్వారా లాభాలు పొందడంతోపాటు, మార్కెట్ పతనాల సమయంలో నష్టాల ను పరిమితం చేసుకోవాలనుకునే వారికి రిస్క్, రాబడుల మధ్య సమతుల్యత సాధించడం కీలకంగా మారింది. అయితే, తమ డబ్బును ఏ పెట్టుబడి సాధనాల్లో మళ్లించాలనే విషయంలో చాలామంది పెట్టుబడిదారులు సందిగ్ధంలో పడుతుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో మోతీలాల్ ఓస్వాల్ నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ప్లస్ 8–13 ఇయర్ జీ–సెక్ 70:30 ఇండెక్స్ ఫండ్ వంటి హైబ్రిడ్ పాసివ్ ఫండ్లు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి.చాలా హైబ్రిడ్ ఫండ్లు పెద్ద కంపెనీల షేర్లు, కార్పొరేట్ డెట్ సాధనాల్లో పెట్టుబడులు పెడతాయి. అయితే, మోతీలాల్ ఓస్వాల్ నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ప్లస్ 8–13 ఇయర్ జీ–సెక్ 70:30 ఇండెక్స్ ఫండ్ మాత్రం మిడ్‌క్యాప్ కంపెనీలు, ప్ర భుత్వ సెక్యూరిటీలకు ప్రాధాన్యం ఇస్తుంది.

# ఫిక్షన్ పేరుతో చారిత్రక అసత్యాలా?



ప్రభాస్ ఫౌజీ మూవీ చిక్కుల్లో పడింది. ప్రభాస్ బర్త్‌డే సందర్భంగా ఇటీవల రిలీజ్ చేసిన గ్లింప్స్‌పై సుభాష్ చంద్రబోస్ మునిమనవడు ఆగ్రహం వ్యక్తం చేశాడు. చారిత్రక సత్యాలను వక్రీకరించి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారని ఆరోపించారు.

**ప్రభాస్ బర్త్‌డే సందర్భంగా...**
ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా అక్టోబర్ 23న ఫౌజీ గ్లింప్స్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ గ్లింప్స్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ ఆర్మీలో రహస్య గూఢచారిగా ప్రభాస్ పనిచేసినట్లు చూపించారు. 1942లో బెర్లిన్‌లో హిట్లర్, సుభాష్ చంద్రబోస్ మధ్య మీటింగ్‌తోనే ఈ గ్లింప్స్ ప్రారంభమైంది. ఆ తర్వాత బ్రిటీషర్లకు వ్యతిరేకంగా గూఢచారి చేపట్టిన సీక్రెట్ మిషన్, భగవద్గీత ఆధారంగా సృష్టించిన కోడ్ గురించి వివరిస్తూ ప్రభాస్ పాత్రకు నేతాజీ ఇచ్చిన ఎలివేషన్లు ఈ గ్లింప్స్‌కు హైలైట్‌గా నిలిచాయి. చివరలో సైనికుడి లుక్‌లో పెద్ద గన్‌తో ప్రభాస్ గ్లింప్స్‌లో కనిపించారు.

**రికార్డ్ వ్యూస్...**
ప్రభాస్ అభిమానులను ఈ గ్లింప్స్ ఆకట్టుకుంటోంది. రికార్డ్ వ్యూస్‌ను రాబట్టింది. కాగా ఈ గ్లింప్స్‌పై సుభాష్ చంద్రబోస్ ముని మనవడు చంద్రకుమార్ బోస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఫౌజీ గ్లింప్స్‌లో నేతాజీ వ్యక్తిత్వాన్ని ఆయన స్థాయిని తక్కువ చేసి చూపించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.



## 19 ఏళ్ల తర్వాత.. మళ్లీ కంగనా రనౌత్

గత కొన్నేళ్లుగా కంగనా రనౌత్ చేసిన లేడీ ఓరియెంటెడ్ సినిమాలన్నీ బాక్సాఫీస్ వద్ద వరుసగా బోల్తా కొడుతూ వస్తోన్నాయి. మంచి హిట్టు అందుకొని పదేళ్లు దాటిపోయింది. 2015లో రిలీజైన తను వెడ్స్ మను రిటర్న్స్ తర్వాత కంగనా నటించిన సినిమాలకు అవార్డులు వచ్చినా డబ్బులు మాత్రం రాలేదు. చివరకు తానే డైరెక్టర్, ప్రొడ్యూసర్‌గా మారి సినిమాలు చేసింది. నష్టాలే మిగిల్చడం తప్పితే కంగనా ఆ సినిమాలే ఏ విధంగా హెల్పవ్వలేదు. దాదాపు పంతొమ్మిదేళ్ల తర్వాత టాలీవుడ్‌లోకి రీఎంట్రీ ఇవ్వబోతుంది. తెలుగులో వెరైటీ సినిమాల డైరెక్టర్‌గా పేరుతెచ్చుకున్న రవిబాబు దర్శకత్వంలో కంగనా రనౌత్ ఓ సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం.



## ఖాకీడ్రెస్‌లో సాయిపల్లవి

సాయిపల్లవి ఫస్ట్ టైమ్ ఖాకీ డ్రెస్‌లో కనిపించబోతుంది. పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తోంది. ధనుష్ హీరోగా నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ రాజ్‌కుమార్ పెరియాసామీ దర్శకత్వంలో ఓమ్ పేరుతో ఓ యాక్షన్ మూవీ రాబోతుంది. ఎర్రచందనం అక్రమ రవాణా బ్యాక్‌డ్రాప్ ఈ తమిళ మూవీ తెరకెక్కుతోంది. 2015లో శేషాచలం అడవుల్లో ఇరవై మంది కూలీలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. ఆ ఘటన తర్వాత స్మగ్లింగ్ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న చాలా మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. అందులో కొందరు సెలిబ్రిటీలు కూడా ఉన్నారు. ఈ యదార్థ సంఘటనల నుంచి స్ఫూర్తి పొంది దర్శకుడు రాజ్‌కుమార్ పెరియాసామీ ఓం సినిమాను రూపొందిస్తున్నారు.ఈ సినిమాలో సాయిపల్లవి పోలీస్ ఆఫీసర్ రోల్‌లో కనిపించబోతున్నట్లు మేకర్స్ వెల్లడించారు. నిత్యా రెడ్డి అనే రఫ్ అండ్ టఫ్ పోలీస్‌గా ఈ నాచురల్ బ్యూటీ కనిపించబోతున్నట్లు పేర్కొన్నారు. మాస్ యాంగిల్‌లో పవర్‌ఫుల్‌గా ఆమె క్యారెక్టర్ ఉండబోతున్నట్లు చూపించారు. శేషాచలం ఎన్‌కౌంటర్ కేసు ఇన్వేస్టిగేషన్‌లో పాల్గొన్న రియల్ పోలీస్ ఆఫీసర్ల స్ఫూర్తితో ఆమె పాత్రను దర్శకుడు డిజైన్ చేసినట్లు సమాచారం.



## విజయ్.. అంటే నాకు పిచ్చి ప్రేమ

తన వైవాహిక జీవితంపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్న నెటిజన్లకు గట్టి బదులిచ్చారు రష్మిక. "నేను కష్టాల్లో ఉన్నప్పుడు విజయ్ నా పక్కన ఉన్నాడు. నేను బాధలో ఉన్నప్పుడు, నాకు సలహాలు, ఓదార్పు అవసరమైననప్పుడు కూడా నాతో పాటే నడిచాడు. నా వెన్నంటి నిలిచాడు. నా కోసం ఎన్ని అవరోధాలు, హద్దులు అయినా దాటే వ్యక్తి నా జీవితభాగస్వామిగా దొరకడం నా అదృష్టం. పెళ్లి తర్వాత కూడా మనం మళ్లీ పెళ్లి చేసుకుందాం చెప్పాలనిపించే తోడు కావాలి. అలాంటి ప్రపోజల్‌ను విజయ్‌తో నేను వెయ్యి సార్లు చేస్తాను... 100 సార్లు అంటే నా దృష్టిలో చాలా తక్కువే. విజయ్ అంటే నాకు పిచ్చి ప్రేమ"అంటూ పోస్ట్ చేసింది.



## చిట్ ఫండ్‌లో డబ్బులు పెట్టి.. అప్పులు చేస్తూ...

'ఆదర్శ కుటుంబం' సినిమాతోనే కెరీర్‌లో మొదటిసారి కామెడీ పాత్ర చేశానని అన్నది శ్రీనిధి శెట్టి. చిట్‌ఫండ్‌లో డబ్బులు పొగొట్టి అప్పులు చేస్తూ భర్తను ఇబ్బంది పెట్టే భార్యగా తన పాత్ర చాలా ఫన్నీగా ఉంటుందని చెప్పింది. ఆమె హీరోయిన్‌గా నటిస్తోన్న ఆదర్శ కుటుంబం మూవీ అక్టోబర్ 30న థియేటర్లలోకి రాబోతుంది. వెంకటేష్ హీరోగా నటిస్తోన్న ఈ సినిమాకు త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్నా రు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఆదర్శ కుటుంబం రిలీజ్ సందర్భంగా శ్రీనిధి శెట్టి పాత్రికేయులతో ముచ్చటించింది. ఆ విశేషాలివి...ఇందులో నేను ఇద్దరు పిల్లల తల్లిగా కనిపిస్తా. అమ్మ పాత్ర అయినప్పటికీ, సినిమాకి నో చెబుదామనే ఆలోచన ఒక్క క్షణం కూడా కలగలేదు. ఇలాంటి సినిమాలు, పాత్రలు అరుదుగా వస్తాయి. అంతలా ఈ కథ, క్యారెక్టర్ నా మనసును ఆకట్టుకున్నాయి. త్రివిక్రమ్ చెప్పినట్లు ఇది క్రైమ్ అంశాలతో సాగే డార్క్ కామెడీ మూవీ. నా కెరీర్‌లో కామెడీ పాత్ర చేయడం ఇదే మొదటిసారి. చిట్‌ఫండ్‌లో డబ్బులు పొగొట్టి అప్పులు చేస్తూ భర్తను ఇబ్బంది పెట్టే ఇల్లాలిగా చాలా ఫన్నీగా నా క్యారెక్టర్‌ను త్రివిక్రమ్ డిజైన్ చేశారు.. అని చెప్పుకుంటూ వచ్చింది.

Trinethra News Telugu
Vol.: 01, Issue: 34
Printed and Published by **Manoj Kumar Yadagiri** on behalf of Trinethra Publications LLP., printed at TIRUMALA GRAPHICS, 1-8-168/A CHIKKADAPALLY, HYDERABAD, TELANGANA - 500020, and published at 105, Sai Madhu Towers, Jai Hind Enclave, Madhapur, Hyderabad 500081, **Editor: S Chiranjeevi Prasad Rao,** Ph: 040 4552 4392, PRGI Registration No. TGTEL/26/A6603.